క్లుప్తంగా

చింతాలమ్మకు జలాభిషేకం



చింతాలమ్మకు జలాభిషేకం నిర్వహిస్తున్న గ్రామస్తులు

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం గ్రామ దేవత చింతాలమ్మ అమ్మవారికి ఆదివారం జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి మహిళా భక్తులు పారాణి, పసుపు నీళ్లు, వేప ఆకులను కలిపిన జలాలను అమ్మవారి మూల విరాట్ విగ్రహంతో పాటు, కలశానికి పోస్తూ చింతాలమ్మ శరణుఘోష చేశారు. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన జలాభిషేకాలు ఉదయం 10 గంటల వరకు కొనసాగుతూనే ఉన్నాయి. గ్రామంలో ఉన్న అమ్మవారి పుట్టినింటితో సహా పెద్ద చెరువు (అంకాల చెరువు) కోనేటి గట్టుపై అమ్మవారి మెట్టినింటి ఆలయం వద్ద కూడా పూజలు నిర్వహించారు.

పారిజాతగిరిలో ఆర్జిత కల్యాణోత్సవం



పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వర స్వామికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహించారు. విజయవాడకు చెందిన గన్నవరపు శ్రీనివాస్, మాధవి దంపతులు ఆర్జిత కళ్యాణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించుకున్నట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ముఖ మండపములో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునికి ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించి తీర్థ,ప్రసాదాలు స్వీకరించారు.

పారిజాతగిరికి లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న కొయ్యలగూడెం సొసైటీ చైర్మన్ మంతెన సోమరాజు

కొయ్యలగూడెం : జంగారెడ్డిగూడెం పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి రూ. లక్ష విరాళం అందజేసినట్లు కొయ్యలగూడెం పీఏసీఎస్ అధ్యక్షులు మంతెన సోమరాజు పేర్కొన్నారు. ఆదివారం దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులను కలుసుకుని లక్ష రూపాయలను అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సొమ్మును ఆలయ అభివృద్ధికి వినియోగించాల్సిందిగా కోరినట్లు చెప్పారు.

జగనన్న సురక్షకు విశేష స్పందన



వేదాంతపురంలో ధ్రువీకరణ పత్రాల పంపిణీ నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : జగనన్న సురక్ష పథకం ద్వారా లబ్ధిపొందుతున్న ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. జూలై 1 నుంచి 15వ తేదీ వరకు పోలవరం నియోజకవర్గం వ్యాప్తంగా 60 చోట్ల జగనన్న సురక్ష కార్యక్రమాలు 7 మండలాల్లో అమలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా 4,715 దరఖాస్తులు స్వీకరించగా, అలాగే 36,384 ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందించారు. ఈ పథకంతో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అవుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

జంగారెడ్డిగూడెం : పేకాట శిబిరంపై ఆదివారం జంగారెడ్డిగూడెం పోలీసులు దాడి చేశారు. ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని కొత్తపేటలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 1,610 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జూదరుల అరెస్ట్

జంగారెడ్డిగూడెం రూరల్ : జంగారెడ్డిగూడెం మండలం నాగులగూడెంలో కోడిపందాలు ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో ఐదుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.2,300 నగదు, ఒక కోడి పుంజు, ఒక కోడి కత్తి స్వాధీనం చేసుకున్నామని ఎస్సై దుర్గ మహేశ్వరావు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

నవరత్నాలతో పేదలకు ఆర్థిక భరోసా

- చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- సీతానగరంలో గడపగడపకు మన ప్రభుత్వం



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎలీజా, పార్టీ శ్రేణులు

చింతలపూడి : పేదలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం నవరత్నాల పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని సీతానగరం గ్రామంలో మండల పరిషత్ చీఫ్ విప్ కలకొండ రామారావు ఆధ్వర్యంలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివద్ధి కార్యక్రమాలను వివరించారు. గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పక్కా డ్రెయిన్లు, అంతర్గత సీసీ రహదారులు నిర్మించాలని, పక్కా గృహాలు మంజూరు చేయాలని పలువురు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి గడపగడపకు కార్యక్రమం దోహదం చేస్తోందని తెలిపారు. ప్రజల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన పట్ల నమ్మకం, విశ్వాసం చూపిస్తున్నారని చెప్పారు. గ్రామంలో ముస్లిం శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని ముస్లిం పెద్దలు ఎమ్మెల్యే ఎలీజాను కోరగా రెండు ఎకరాలు ప్రభుత్వ భూమిని కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, ఎమ్మెల్యే సతీమణి ఝాన్సీరాణి, సర్పంచ్ గాయం మల్లీశ్వరి, ఎంపీటీసీ కె.రామారావు, వైస్ ఎంపీపీ ఎస్.వరలక్ష్మి, దన్నపనేని శ్యామ్ సుందర్‌రావు, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, చింతంపల్లి సర్పంచ్ తాండ్ర రామకష్ణ, ఉర్లగూడెం సర్పంచ్ యువరాజు, యండపల్లి సర్పంచ్ యడ్ల మోహన్‌రావు, ఎ.సుబ్బారావు, సీహెచ్ నాగేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కొప్పుల నాగేశ్వరరావు, ఎం.దిలీప్, ఎస్ దుర్గారావు, జంగా చెన్నకేశవ రెడ్డి, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

భరోసా ఏర్పడింది



వలంటీర్ వ్యవస్థ ద్వారా భరోసా ఏర్పడింది. గతంలో ఏదైనా పథకం పొందాలంటే ముందుగా సమాచారం తెలిసేది కాదు. దీంతో అర్హత ఉండి ఆయా పథకాలు పొందలేని పరిస్థితి. వలంటీర్ వ్యవస్థతో ఆ సమస్య తీరింది. మా వలంటీర్ యాస్మిన్ ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని తెలియజేస్తోంది. స్వయంగా ఇంటికి వచ్చి ఆయా పథకాలకు దరఖాస్తు చేయించి, మాకు వర్తించేలా చూస్తోంది. వలంటీర్ వ్యవస్థను అందించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు. సేవకు ప్రతిరూపంగా నిలిచిన వలంటీర్ వ్యవస్థపై పవన్ కళ్యాణ్ చేసిన వాఖ్యలు బాధించాయి. వలంటీర్లకు పవన్ క్షమాపణ చెప్పాలి.

– ముప్పిడి తులసి, 8వ వార్డు, జంగారెడ్డిగూడెం

సొంత మనిషిలా ఆదరిస్తున్నారు



నా పేరు ఇ.రాణి. పోలవరం మండలం ప్రగడపల్లి సచివాలయం వలంటీర్‌గా పనిచేస్తున్నాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయవల్ల ఆర్థిక భరోసాతో పాటు ప్రజలకు సేవలు అందించేందుకు అవకాశం కలిగింది. సంక్షేమ పథకాలు 50 ఇళ్ల లబ్ధిదారులకు సకాలంలో అందజేస్తున్నాను. ప్రతి పథకం గురించీ ఇంటింటికీ వెళ్లి తెలియజేస్తున్నాను. కరోనా సమయంలో కూడా వారి ఇళ్లకు వెళ్లి పింఛన్‌లు, ఇతర పథకాల లబ్ధి అందించాను. ఏ ఇంటికి వెళ్లినా సొంత మనిషిలా ఆదరిస్తున్నారు. గౌరవం, గుర్తింపు వలంటీర్ వ్యవస్థ ద్వారా లభించింది. వలంటీర్ వ్యవస్థను జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ కించపరచడం బాధాకరం

గిరిప్రదక్షిణ రోడ్డులో ఖర్జూరం మొక్కలు



ఖర్జూరం మొక్కలు నాటుతున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి ఆలయ గిరి ప్రదక్షిణ రోడ్డులో ఖర్జూరం మొక్కలు ఆదివారం నాటారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దండు ధనరాజు మాట్లాడుతూ కమిటీ ఆర్థిక సహకారంతో 190 ఖర్జూరపు మొక్కలు కొనుగోలు చేశామన్నారు. వీటిని గిరిప్రదక్షిణ రోడ్డులో నాటుతున్నట్లు తెలిపారు. తొలి మొక్కను ఆలయ ఈవో మానికల రాంబాబు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించగా, ది మోటార్ ఫీల్డ్ వర్కర్స్ ఓనర్స్ ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో రాజాని తారక శ్రీనివాసరావు నాయుడు, నడిపిన నర్సింహరావు, కృష్ణ, జశ్వంత్, కోటా అప్పారావు, సీతారాము, అంజి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం తరఫున ఆదుకుంటాం

దీనస్థితిలో ఉన్న బాలికలకు కలెక్టర్, ఎమ్మెల్యే భరోసా



కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు బాలికల దుస్థితిని వివరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల : ఆ బాలికలు చిన్నతనంలోనే తల్లిని కోల్పోయారు. ఆ తరువాత కోవిడ్ మహమ్మారి కారణంగా తండ్రిని కూడా పోగొట్టుకున్నారు. మానసిక వైకల్యం కలవారు కావడంతో ఆ బాలికలను మారుటతల్లి విడిచిపెట్టి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆ పిల్లల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. అయితే ప్రభుత్వం తరఫున ఆదుకోవడానికి మేమున్నామంటూ, మండలంలోని తిమ్మాపురంలో శనివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆ బాలికలకు భరోసానిచ్చారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని జాజులకుంటకు చెందిన పెనుమాల మధు, లక్ష్మి దంపతులకు ప్రవల్లిక, మౌళిక సంతానం. వీరు మానసిక వైకల్యంతో బాధపడుతున్నారు. వారి చిన్నతనంలోనే తల్లి లక్ష్మి మృతి చెందడంతో తండ్రి మధు స్వాతి అనే మహిళను వివాహం చేసుకున్నాడు. అయితే మధు రెండేళ్ల క్రితం కోవిడ్‌తో మృతి చెందాడు. దాంతో స్వాతి పిల్లలను విడిచిపెట్టి వెళ్లిపోయింది. అప్పటి నుంచి బాలికలిద్దరూ వారి తాత వద్దే ఉంటున్నారు. ప్రస్తుతం ఆయనకు వీరి పోషణ కష్టతరం కావడంతో, స్థానికులు ఆ బాలికలను తీసుకెళ్లి ముందు ఎమ్మెల్యే తలారిని కలసి విషయాన్ని తెలిపారు. దాంతో చలించిపోయిన ఆయన ఆ బాలికల దుస్థితిని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు వివరించారు. అనంతరం బాలికలను ప్రభుత్వం తరఫున పూర్తిస్థాయిలో ఆదుకుంటామని వారు హామీ ఇచ్చారు.

నేడు వనదుర్గాదేవిగా నూకాలమ్మ

జంగారెడ్డిగూడెం : నూకాలమ్మ అమ్మవారు ఆషాఢ అమావాస్యను పురస్కరించుకుని సోమవారం వనదుర్గాదేవి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారని ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు) తెలిపారు. ప్రకృతి స్వరూపమైన అమ్మవారిని వనాలలో లభించే విశేష పత్రులతో కూడిన అలంకరణ చేయనున్నామని, వేప, మామిడి, రావి, జువ్వి, నేరేడు, మర్రి ఇలా అనేక పత్రులను సేకరించి అమ్మవారిని ఆలయ ప్రధానార్చకులు యరమిల్లి మనోజ్ శర్మ ఆధ్వర్యంలో అలంకరించనున్నట్లు చెప్పారు. కాగా ఆదివారం మాటీవీ సూపర్ సింగర్ జూనియర్ విభాగం ఫైనలిస్ట్ దొంతంశెట్టి ధీరజ్ కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకోగా, వారికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

నంది అవార్డుల ప్రకటనపై హర్షం



ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలరావుతో నాటకరంగ కళాపరిషత్ సభ్యులు

కొయ్యలగూడెం : రంగస్థలానికి పూర్వ వైభవం తీసుకువచ్చేలా ప్రభుత్వంచే నంది అవార్డు ప్రకటన నాటక రంగ కళాకారులకు ఊపిరులు ఊదినట్లు అయ్యిందని నాటక రంగ కళాపరిషత్ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం తాడేపల్లిలోని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలరావు కార్యాలయంలో కలుసుకుని ప్రభుత్వానికి నాటక కళాకారుల తరుపున కృతజ్ఞతలు తెలిపి సత్కరించినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ఐదు నాటిక పోటీలతో పాటు మొత్తం 73 నంది అవార్డులను ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణ మురళి ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఉపముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నామన్నారు. కనుమరుగవుతున్న పద్య, సాంఘిక, నాటకాల పూర్వ వైభవానికి ప్రభుత్వం కృషిచేయడం హర్షణీయం అని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం నాటక కళారంగానికి అందించాల్సిన నంది అవార్డులను విస్మరించిందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాటక రంగ నంది అవార్డు గ్రహీతలు ఎంవీ రాజర్షి, నాగభట్ల రఘు, ఉమా శంకర్, లోవరాజు, మణికంఠ ఆర్ట్స్ పిఠాపురం సమాజం, కొండేవరం నాటక రంగ కళాపరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న కుక్కునూరు పీహెచ్‌సీ సిబ్బంది

కుక్కునూరు : వర్షాకాలం కావడంతో విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా మండలంలోని ఆశ్రమ పాఠశాలల్లో కుక్కునూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. కుక్కునూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో శనివారం నిర్వహించిన ఈ శిబిరంలో విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి తగిన మందులు అందించారు. ఇప్పటికే విద్యార్థులకు రక్తహీనత రాకుండా ప్రతి గురువారం ఐరన్ టాబ్లెట్లు అందిస్తున్నట్లు కుక్కునూరు పీహెచ్‌సీ వైద్యుడు డా.శ్రీనివాస్ చెప్పారు. వర్షాకాలం సీజనల్ వ్యాధుల బారిన పడకుండా విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా అవగాహన కల్పించామన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ



కాంతంపాలెంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

చింతలపూడి : బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని సొసైటీ అధ్యక్షుడు ఆతుకూరి సుబ్బారావు అన్నారు. మండలంలోని కాంతంపాలెం గ్రామంలో మాదిగ యువసేన యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శేఖర్ మాదిగ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని అమలు పరచడంలో జగ్జీవన్‌రామ్ ప్రముఖ పాత్ర పోషించారని అన్నారు. కేంద్ర మంత్రిగా దళిత జాతి ఉన్నతికి పాటు పడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, ఎమ్మార్పీఎస్ నాయకులు కలపాల సురేష్ మాదిగ, ముప్పిడి శామ్యూల్, ముప్పిడి జాషువ, సర్వేశ్వరరావు, టి సురేష్, దుక్కిపాటి చిన్న, డి.పెద్ద మారేష్, తాళ్ళూరు ఏసేబు, డి.శ్రీనివాసరావు, డి.సందీప్, హరీష్, నితిన్, నవీన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిజం తెలుసుకో మద్దిపాటి

- ఆ తరువాత ధర్నాలు చేద్దువుగాని
- అనవసరంగా ప్రభుత్వంపై బురదచిమ్మితే చూస్తూ ఊరుకోం
- వైఎస్సార్ సీపీ మండల మహిళా అధ్యక్షురాలు ధ్వజం



ద్వారకాతిరుమల మండలం బుట్టాయిగూడెంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల మహిళా అధ్యక్షురాలు నాగమణి

ద్వారకాతిరుమల : మద్దిపాటీ.. ముందు నిజం తెలుసుకో, ఆ తరువాత ధర్నాలు చేద్దువుగాని.. మా ప్రభుత్వంపై అనవసరంగా బురదచిమ్మాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోమని వైఎస్సార్ సీపీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి హెచ్చరించారు. మండలంలోని బుట్టాయిగూడెంలో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన నోముల రాంబాబు పూరి గుడిసెకు రూ. 26,660 విద్యుత్ బిల్లు వచ్చిందంటూ ఈనెల 13న రాత్రి గోపాలపురం టీడీపీ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు, పాత విద్యుత్ బిల్లును పట్టుకుని ఆందోళన చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బిల్లు ఎక్కువ వచ్చిందనగానే దానిపై తేదీ కూడా చూడకుండా హడావిడిగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురదచిమ్మేందుకు ఆయన ప్రయత్నం చేశారని, చివరకు ఆయనే అబాసుపాలయ్యారని అన్నారు. సొంత పార్టీలో ఆయనను వ్యతిరేకిస్తున్న ప్రత్యర్థి వర్గంపై పైచేయి సాధించాలన్న ఉద్దేశ్యంతోనే ఇలాంటివి చేస్తున్నట్టు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రాంబాబుకు విద్యుత్ సబ్సిడీ ఇచ్చింది మీ నాయకుడు చంద్రబాబు కాదని, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆమె గుర్తు చేశారు. రాంబాబు విద్యుత్ సర్వీస్‌కు సంబంధించిన ఆన్‌లైన్ హిస్టరీలో ప్రస్తుతం పాత బకాయి రూ. 10,268 చూపిస్తోందని, అది మీకు కనబడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ నేతల అక్కసును, అక్రమాలను బయటపెడుతున్న సాక్షి పత్రిక, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియాపై సైతం మద్దిపాటి విషం కక్కుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ముందు పాత విద్యుత్ బిల్లులను పట్టుకుని తిరగడం మాని, ప్రజలకు మీరేం చేస్తారో చెప్పాలని ఆమె హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కంతేటి గంగయ్య, దార్శిన ప్రకాష్, తోట స్వాతి, బెజవాడ మరియమ్మ, పెండ్యాల మూర్త, వంగలపూడి విజయ, పులపాకుల కృష్ణమూర్తి తదితరులున్నారు.

కాపునేస్తం పథకానికి దరఖాస్తులు

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో కాపు నేస్తం పథకం మంజూరుకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని నియోజకవర్గ కాపు సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నేత పోకల రాంబాబు అన్నారు. ఆదివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో కాపునేస్తం పథకంలో కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలకు చెందిన అర్హులైన ప్రతి మహిళ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న కాపు నేస్తంలో ఇస్తున్న రూ.15 వేలు పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారన్నారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో అన్ని గ్రామాల్లో కాపు సంఘం నేతలు, కాపు యువతతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులందరూ వైఎస్సార్ కాపునేస్తం పథకానికి అర్హులందరూ దరఖాస్తులు చేసుకునేలా తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. 45–60 ఏళ్లలోపు వయస్సున్న మహిళలు ఈ పథకానికి అర్హులన్నారు. కుటుంబం మొత్తానికి ఫోర్‌వీలర్స్ ఉండకూడదన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయాల్లో అర్హులైన మహిళలు తమ దరఖాస్తులను ఆధార్‌కార్డు, వయస్సు ధ్రువీకరణ, కులధ్రువీకరణ, నివాస ధ్రువీకరణ పత్రాలను సచివాలయంలో అందించి ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాపు, బలిజ, ఒంటరి, తెలగ, కులాలకు చెందిన మహిళలకు ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి కల్పించడం ద్వారా జీవన విధానం మెరుగుపరిచి శాశ్వత భద్రత కల్పించే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ వైఎస్సార్ కాపునేస్తం పథకాన్ని అమలు చేస్తున్నారని పోకల రాంబాబు అన్నారు.

నేడు దర్భగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి మండలం దర్భగూడెంలో సోమవారం ఉదయం 9 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ కృష్ణప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తారన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు, తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పట్టణంలో చెట్ల కొమ్మలు తొలగించడం, మరమ్మతులు సోమవారం నిర్వహిస్తున్నామని, ఈ క్రమంలో ఉదయం 7.30 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.రాధాకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎస్ఆర్ ఫీడర్ పరిధిలోని ప్రతిభ స్కూల్ పోలీస్‌స్టేషన్, చిదంబరం హాస్పిటల్ ప్రాంతాల్లో, సుబ్బంపేట, తాండ్రపాపారాయుడు సెంటర్, సాలిపేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు



నిందితులకు కౌన్సిలింగ్ ఇస్తోన్న సీఐ శివాజీ

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో గంజాయి రవాణా, విక్రయాలు చేస్తే తాట తీస్తానని ఏలూరు త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ హెచ్చరించారు. ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిత్యం గంజాయి విక్రయాలు, రవాణాపై నిఘా ఉంటుందన్నారు. ఏలూరు త్రీటౌన్ స్టేషన్‌లో ఆదివారం గంజాయి కేసుల్లో నిందితులు, గంజాయి తాగేవారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ శివాజీ మాట్లాడుతూ ఏలూరు త్రీటౌన్ పరిధిలో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యార్థులు, యువతకు గంజాయిని అలవాటు చేస్తూ వ్యాపారం చేసే వ్యక్తులపైనా నిఘా ఉందన్నారు. గంజాయి తాగినా సహించేదిలేదనీ, మీ ప్రవర్తనలో మార్పు రావాలని సీఐ సూచించారు. గంజాయి తాగటం వల్ల యువత తన శక్తిసామర్థ్యాలను కోల్పోతారని, మానసిక వత్తిడితో, గంజాయికు బానిసలుగా మారి భవిష్యత్తు నాశనం అవుతుందని హితవు పలికారు. తమ పిల్లల ప్రవర్తనపై ప్రతి తల్లిదండ్రి పర్యవేక్షణ ఉండాలనీ, కళాశాలలకు వెళ్లే విద్యార్థులను నిత్యం పరిశీలిస్తూ ఉండాలని సీఐ శివాజీ కోరారు.

గ్రామాల్లో శాంతి పరిరక్షణ కమిటీలు

ఏలూరు టౌన్ : ఏలూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని, విధుల్లో అలసత్వాన్ని సహించబోమని ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు అన్నారు. ఏలూరు సబ్‌డివిజన్ పరిధిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లతో ఆయన ఆదివారం నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఏలూరు సబ్ డివిజన్ పరిధిలో ఆయా సర్కిళ్ల వారీగా కేసుల నమోదు, పెండింగ్ కేసులు, విచారణ దశలో ఉన్న కేసులు, కోర్టుల్లో ఛార్జిషీట్లు దాఖలు, నాన్ బెయిలబుల్ వారెంట్లపై క్షుణ్ణంగా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ చోరీలను నివారించేందుకు, నేరాలను అదుపు చేసేందుకు రాత్రి, పగలు గస్తీని మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. బస్టాండ్, ప్రధాన కూడళ్లు, కళాశాలల వద్ద బాలికలు, యువతులను అల్లరిమూకలు వేధించకుండా మహిళా కానిస్టేబుళ్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఎస్పీ చెప్పారు. ఈ నేర సమీక్షలో త్రీ టౌన్ సీఐ ఆకుల రఘు, భీమడోలు సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సైలు ఉన్నారు.

సెకండ్ సెమిస్టర్ పుస్తకాలు వచ్చాయ్

దెందులూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 13,203 సెకండ్ సెమిస్టర్ పుస్తకాలు వచ్చాయని మండల విద్యాశాఖాధికారి ఎ.ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 1 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సెకండ్ సెమిస్టర్ పుస్తకాలు ఎంఈఓ కార్యాలయానికి చేరాయని, రెండు రోజుల్లో పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తామని ఎంఈఓ ప్రసాద్ తెలిపారు.